# వీధిగుమ్మం

ఉదయం నుంచీ ఇంటి పనులన్నీ చేసి చేసి అలిసిపోయింది ఉమామహేశ్వరి. సాయింత్రం చల్లగాలికి కాసేపు వీధిగడపలోకి వచ్చికూచుంది.

అప్పటికే ఎదురింటి శైలజ వీధి అరుగుమీద ఇరుగు పొరుగులతో కబుర్లు ప్రారంభించింది. రాణీ కూడా చంటి బిడ్డణ్ణి చంకనేసుకుని ఇవతలికి వచ్చింది. అన్నపూర్ణ కూడా అక్కడే వుంది.

ఉమామహేశ్వరికి ఇద్దరు మొగపిల్లలు. పెద్ద వాడికి నాలుగేళ్ళు, రెండో వాడికి రెండేళ్లు ఆ వీధి చివరలో జూనియర్‌కాలేజీ వుంది. ఆ కాలేజీ గ్రౌండుకు ఆడుకోడానికి పోయారు. ఆచుట్టు పక్కల చాలా మంది పిల్లలు కాలేజీ గ్రౌండుకు ఆటకి వెళతారు. ఆడలేనివాళ్ళు ఆడేవాళ్లని చూడ్డానికీ రికామీగా తిరగడానికిపోతారు.

ఉమామహేశ్వరి వాళ్లాయన ఆర్ అండ్ బి ఆఫీసులో గుమస్తా.

శైలజకి ఒక ఆడపిల్ల, ఒక మగ పిల్లడూను. వాళ్ళది ఒంగోలు. వాళ్ళాయన గిరిజన కార్పొరేషన్‌లో మేనేజరు. ఇంట్లో సమస్తమూవున్నాయి. టి.వీ, ఫ్రిజ్, ఎయిర్ కూలర్, గాస్ స్టౌ, గ్రైండర్- ఈ రోజుల్లో అందరిళ్లల్లోనూ వుండేవే. శైలజా వాళ్లింట్లో బట్టలుతుక్కునే మిషనుంది. చపాతీలు ఒత్తేందుకు కూడా మిషనే.

రాణీ వాళ్లాయన ఫారెస్టు రేంజర్. గిరిజన్ కార్పొరేషన్ దాటాకా వుంది ఫారెస్టాఫీసు. రాణీకి ముగ్గురూ ఆడపిల్లలే. వాళ్లింట్లో అంతులేని ఫర్నిచరుంది. అంతా రోజ్‌వుడ్‌దే. బంధువులందరికీ ఇక్కణ్ణించే చేయించి పంపిస్తున్నానంటాడు. కాదు వైజాగ్‌లో ఫర్నిచర్ షాపుకు అమ్మేస్తున్నా డంటారు. నిజా నిజాలు మనకేం తెలుసు?

అన్నపూర్ణ పెనిమిటి మునిసిపల్ హైస్కూల్లో టీచరు. ఇద్దరు కొడుకులు. ఒకడు టెన్త్‌క్లాసు చదువుతున్నాడు. రెండోవాడు సెవెన్త్ క్లాసు. వాళ్లది పెంకుటిల్లు.

ఆ చుట్టు పక్కల ఇళ్లన్నింటికీ శైలజ యిల్లు కేంద్రం. అందరూ ఈ జిల్లా వాళ్ళే. ఒక్క శైలజ మాత్రం ఒంగోలు మనిషి. విశాఖ జిల్లా వాళ్లకు ఆమె మాటలు చాలా తమాషాగా వినిపిస్తాయి.

అగ్గిపెట్టెల్లా వున్న అద్దె కొంపల్లో వుండటం కష్టం. విశాలమైన గదులూ పెద్ద పెద్ద కిటికీలూ, చుట్టూ చిన్నతోటా పచ్చని చెట్లూ వున్న ఇంట్లో వుండాలని ఉమామహేశ్వరికి కల. మధ్య తరగతి కుటుంబాల కలలు నిజం కావడం ఎన్నడూ జరగదని ఆమెకూ తెలుసు.

వెలుతురుండగానే సాయింత్రపు వంట పూర్తిచేసి, ఇళ్లూ గుమ్మాలూ శుభ్రంచేసుకుని స్నానం చేసి, వంటి నిండా పౌడరద్దుకుని, తెలిగ్గా బట్టలు కట్టుకుని వీధిగుమ్మంలో వచ్చికూచుంటే ప్రాణం తేలికగా వున్నట్టనిపిస్తుంది.

"ఏంది, మీ వంటలయిపోయినయ్యా?" అని పలకరించింది శైలజ.

"ఆఁ అయ్యాయి, మీవి?" అన్నది ఉమ.

"అయినయి. వంకాయ పచ్చిపులుసు జేసి, కాకరకాయ వేపుడుజేశా. రసం ఉదయం జేసింది ఎట్టానూ వుండనే వుండె. ఇంకేంది వంట. ఆయన వచ్చేటప్పుడు మామిడిపళ్లు ఎత్తుకొస్తారు–"

తలుపు గెడపెట్టి శైలజగారి అరుగుమీదకి వచ్చింది.

"శ్రీ కన్యా టాకీసులో కొత్తసినిమా వచ్చిందటగా. 'సందులో సుందరి' ఎట్టుంది. బాందా?"

"మా ఆయన చూశారట పరమ బోర్–"

'మొన్న 'కొండపల్లి కోతి' సినీమా జూశాం. బాలే. ఫైటింగ్ మాత్రం బాగుంది. కోతి బలే ఫైటింగ్ జేసుద్ది–"

"అన్నట్టు మీరు కొత్త సీరియల్ చదువుతున్నారా? రక్తపు మడుగులో రోజా పూలు! యమ సస్పెన్స్ అనుకోండి"

"రైల్లో రక్తపుటేరు కంటె సస్పెన్సా?"

ఇంతలో మల్లెపూలొచ్చాయి వీధిలోకి. తలా ఒక మూరెడూ మల్లెపూల దండలు కొన్నారు.

"మా ఒంగోల్లో మల్లెపూలు శానా సవక. ఇక్కడేంది ఇంత పిరియం. మా బావగారిది మైనంపాడు. దగ్గరే మాకు. వచ్చేటప్పుడల్లా బొచ్చెడు మల్లెపూలు ఎత్తుకొస్తారు–" అన్నది శైలజ.

జూనియర్ కాలేజీ గ్రౌండ్స్ నుంచి ఆటగాళ్లు వస్తున్నారు. పది పదిహేను మంది జట్టు. అందులో ఒకతను చాలా పొడవుగా వుంటాడు. అతను వచ్చేటప్పుడూ వెళ్ళేటప్పుడూ తప్పనిసరిగా ఉమా మహేశ్వరిని గుచ్చి గుచ్చి చూస్తాడు. ఉమకి వొళ్ళంతా జివ్వు మనిపించినట్టుంటుంది. పయిట సవరించుకుని నిండుగా కప్పుకుంటుంది. చిన్న చిరునవ్వు నవ్వుతాడు.

నిజానికి అక్కడికి చేరిన ఆడంగులందరిలోనూ ఉమ అందగత్తె. చంపకు చారెడు కళ్ళు, చిన్న నోరు, సన్నగా పొడవుగా వుంటుంది. ఇద్దరు పిల్లలు పుట్టాక కొంచెం వళ్లు చేసింది. ఇంతకు ముందు మరీ సన్నంగా గట్టిగా గాలివీస్తే ఎగిరిపోయేలా వుండేది.

ఆమెవేపు ఎంతో ఆశగా చూస్తాడు. ఒళ్ళంతా తడిమినట్టు చూస్తాడు. కొరుక్కుతిన్నట్టు చూస్తాడు. తనకు పెళ్లయిందని తెలీదా? ఎన్నోసార్లు మంగళసూత్రాలు కనపడేలా పయిటసర్దుకుంది. కాళ్ళకు మట్టెలు కనపడటం లేదూ? అయినా ఎందుకు తననలా చూస్తాడు?

అదుగో వస్తున్నాడు. ఎంతమందిలో వున్నా యిట్టే పోల్చవచ్చు. ఆరడుగుల పైనే వుంటాడు. ఉంగరాల జుట్టు. ఒత్తుగా మీసం, బలిష్టమైన కండలు తిరిగిన విగ్రహం. ఇవ్వాళ పాంటూ షర్టూ వేసుకున్నాడు. ఒకోరోజు బనీనూ, నిక్కరూ, తెల్లని బూట్లూ వేసుకుంటాడు. అటువంటి సమయంలో అతన్ని చూస్తే ఆమె మనసు చెలరేగి పోతుంది. ఛీ పాడు మనసు.

ఇవ్వాళతను కావాలనే బంతి జార విడిచి మళ్ళీ తీసుకున్నాడు. బంతి తీస్తూ ఎలా చూశాడో! మధురమైన షాక్.

వెళ్ళిపోయారు జనం–

శైలజ ఒకోసారి పచ్చిశృంగారం మాట్లాడుతుంది.

పెళ్ళికాని కన్నెపిల్లలకంటె, కొత్తగా పెళ్లయినవాళ్లే ఎంతో అందంగా వుంటారట. రక్తం మారి, రంగుతేరి మాంచి రంజుగా వుంటారట. కన్నెపిల్లలంటే పరువానికి వచ్చిన పండుకాయలు పెళ్ళయినవాళ్ళు చక్కగా ముగ్గిన పళ్ల లాంటివాళ్ళు. అలా అని వాళ్ళాయన అంటూ వుంటాడని ఎంత సిగ్గులేదో పడకగదిలో మాటలు పదిమందికీ చెప్పడానికి శైలజ.

మధ్యతరగతి కుటుంబాల్లో ఆడవాళ్ళు ఎక్కడికి వెళతారు? ఎప్పుడైనా వెళితే సినీమాకి, తప్పితే పేరంటానికి. ఇతర రోజుల్లో ఇంట్లోపడి మగ్గవలసిందే వాళ్ళకి వీధిగుమ్మమే కాలక్షేపం–

తాము వీధుల్లో తిరుగుతున్నప్పుడు గడపల్లోవున్న ఆడవాళ్లను అదేపనిగా చూడరా మగవాళ్ళు? బస్సు స్టాండులో సినిమాహాళ్లలో, రైల్వే స్టేషన్‌లో, మార్కెట్‌లో అవకాశంవస్తే ఆడవాళ్లను రాసుకుని తిరగడానికి ప్రయత్నించరా? తమ ఆడవాళ్ళు మాత్రం వీధిగుమ్మంలో నిలబడితే తప్పా? వీధిగుమ్మంలోకి

రాకుండా ఏ మగవాళ్లైయినా – ఒక్క రోజు వంటగదిలో గడపమనండి.

రాణీ వాళ్ళాయన కూడా దెబ్బలాడాడట.

"ఎందుకు అస్తమానూ సానిపాపల్లా ముస్తాబులై వీధిలో నిలబడతారూ ఎన్నడూ మనుషుల మొహం చూడనట్టూ!" అని తిట్టాడట.

అతను రోజూ ఇంట్లోనే తాగుతాడట. ఏది కావాలంటే అది అమర్చిపెట్టాలి. అంతా అయ్యాక పిలిస్తే దగ్గరికి వెళ్ళాలి. గసిరితే అవతలికి పోవాలి,

వాళ్ళాయన సంగతులు రాణీ చెబుతుంటే ఉమకు చాలా కష్టం అనిపించింది. ఒకోసారి ఆయన స్నేహితుల్ని కూడా యింటికి తీసుకొస్తుంటాడట.

ఒకరోజు ఎండ ఫెళఫెళలాడుతూ కాసింది. గాలి నిప్పులు చెరిగింది. సాయంత్రం ఆరయినా ఎండ తగ్గలేదు.

అన్నపూర్ణకు మూడురోజుల నుంచి జ్వరంట. ఇవతలకి రాలేదు.

రాణీ వాళ్లు పెళ్ళికి వెళ్లారు.

ఇక శైలజా, ఉమామహేశ్వరీ మిగిలారు.

వాళ్ల ముందుమంచే చంపా, వాళ్లాయనా కబుర్లాడుకుంటూ, నవ్వుకుంటూ నడిచివెళ్లారు షికారుకో, సినిమాకో. వాళ్లు వెళ్లిన కొద్దిసేపటికే కాలేజీ గ్రౌండ్స్ నుంచి ఆటగాళ్లజట్టు వచ్చారు. అతను యధా ప్రకారంగా తన వేపు చూసి నవ్వాడు. అనుకోకుండా తనూ నవ్వింది. కాని అంతలోనే బిగిసిపోయింది. గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి.

రమణమూర్తి!

ఆ గుంపు వెనకాలే వస్తున్నాడు.

గబ గబా యింట్లోకి పరుగుతీసింది.

పెద్ద యుద్ధం జరిగిపోయింది యింట్లో.

ఆడదాన్ని నమ్మకూడదట. మగ వాళ్లని నమ్మవచ్చునుగావును. ఉమామహేశ్వరికి అతని మాటలు వింటుంటే వెర్రికోపం వచ్చేసింది. చాలా అవమానం అనిపించింది.

"పగలంతా ఉక్కలోచచ్చి యింటి పనంతా చేసి సాయంత్రం కాస్సేపు వీధిగుమ్మంలోకివచ్చి నిలబడేసరికి ఏదో నేరం చేసినట్టు. అంతంత మాటలంటారేమిటీ" అన్నది ఉండబట్టలేక.

గూబ గుయ్యిమంది.

ఆ కేకలూ. ఆ తగవూ, తండ్రి తల్లిని కొట్టడం చూసి పిల్లలిద్దరూ ఏడవటం ప్రారంభించారు. చిన్నవాడు తల్లి కుచ్చెళ్లు పట్టుకుని ఏడుస్తుడు మరింక వంటగది లోకి వెళ్ళిపోయింది.

మగవాడి ప్రమేయం లేకుండానే ఆడది చెడిపోతుందా? మరి మగవాడు మాత్రం చెడిపోయినట్టుకాదా? ఇన్నివేల సంవత్సరాల తరువాత కూడా ప్రపంచం ఇంత నాగరికంగా మారాక కూడా మగవాళ్ల మనస్తత్వం ఎంత దారుణంగా వుందీ! ఎంత స్వార్థం! ఎంత కుళ్లు!

మూర్తి సుష్టుగా భోజనంచేసి, వక్కపొడి వేసుకుని. సిగరెట్టు కాలుస్తూ సస్పెన్స్–క్రైమ్ – థ్రిల్లర్ చదువు కుంటున్నాడు.

ఉమామహేశ్వరికి మనసంతా అసహ్యంగావుంది. కుతకుతలాడి పోతోంది. ఏదో ఒకటి ఇప్పటికిప్పుడు చేసెయ్యాలనివుంది. ఏం చేస్తుంది?

పంజరంలో చిలుక, బోనులో పడ్డ ఎలుక.

భోజనం చెయ్యబుద్ధికాలేదు. వంటగది గడపలో అలా కూచుండి పోయింది. ఎంతసేపు కూచుందో తెలియదు--

పడకగదిలోంచి గురకలు వినిపించాయి.

రమణమూర్తి లైటయినా ఆర్పకుండా గుండెలమీద పుస్తకం పడేసుకుని నిద్రపోతున్నాడు.

ఉమకు ఆకలి వేస్తోంది. కడుపులో పేగులు చుట్టుకుపోతున్నాయి. వీధి గుమ్మంలో నిలబడినందుకు ఎంత రాద్ధాంతం జరిగిందీ!

భోజనం మానేసీ, ఏడిచీ ఎవర్ని సాధించాలి. లేచి భోజనం చేసింది. కొంచెం సత్తువ వచ్చింది. ధైర్యం వచ్చింది.

ఆవేశం అణుచుకుంది.

రేపటినుంచి మామూలుగా వీధి గుమ్మంలో నుంచుంటుంది. ఇంకా వీయిలతే షికారు కూడా వెళ్తుంది పిల్లల్ని తీసుకుని. అంతే! అని నిర్ణయించుకుంది. ఈ మగవాళ్లతో ఎదురుతిరగకపోతే లాభం లేదు. ఇలా అనుకొనేసరికి మనసు తేలికపడింది. ఆవలింతలు, నిద్ర ముంచుకొస్తోంది. పక్కింటి వాళ్ల గడి యారం పన్నెండు గంటలు కొట్టింది. మంచం మీద వాలిపోయింది ఉమామహేశ్వరి.

*రచన : ఆగస్టు 1986*

*ప్రచురణ : ఆంధ్రపత్రిక, ఆదివారం అనుబంధం. 16-11-86*